# అన్నం

పిల్లికి చెలగాటం, ఎలక్కి ప్రాణసంకటం. ఒక పిల్లి చెలగాటమే ఎలక్కి ప్రాణసంకటంగా వున్నప్పుడు, మూడు నాలుగు పిల్లుల చెలగాటం ఎలక్కి ఎంత ప్రాణసంకటంగా వుంటుందో ఊహించుకోవచ్చు. అయితే, ఇక్కడ ఎలుక ఎలుకలాంటి రోగోడు కాదు. 'రోగోడి అమ్మ శేషమ్మ!' ఈ ఎలుకా పిల్లుల చెలగాటం (చెలగాటం పిల్లులదే) ఎలా వుంటుందంటే.....

ఊర్మిళకు శేషమ్మ కొడుకును చూస్తే చెడ్డ చిరాకు. "అట్లాంటి పిల్లోళ్ళను ఎట్టాపుట్టించుకుంటారోఛీ .... ఛీ .... యాక్" అంటుంది. అంతటితో వదిల్తేనా! పొద్దున్నే రోగోడు కనపడితే ఇక ఆ రోజంతా సుఖంగా వుండదన్నది కూడా ఆమె నమ్మకం. ఆ నమ్మకం నిరాధారమైనదని విజయకుమార్ వాదిస్తాడు. "లేదు, ఆ రోజున నేను మనస్సు కష్టపెట్టుకునే సంఘటనలు జరుగుతాయ్"అంటుంది. ఊర్మిళ. "మొన్న పొద్దున్నే కనిపించాడని వాణ్ణి తిట్టావే, ఆరోజు నీకేం కష్టాలొచ్చాయో చెప్పు ?" అని విజయకుమార్ ప్రశ్నిస్తాడు. "పొద్దున్నే వాణ్ణి చూశానని ఆరోజంతా అక్క బాధపడింది కదా, అంతకంటే ఇంకేం కష్టం రావాలి? " అంటుంది శైలజ. అంతా నవ్వుతారు. "మనకు మూఢనమ్మకాలెక్కువ ......" అనిపాతం మొదలుపెడతాడు విజయకుమార్. "నాదేం మూఢనమ్మకం కాదు ..." అని మధ్యమధ్యలో ప్రతిఘటిస్తూ వుంటుంది ఊర్మిళ.

అప్పుడు ఆ పిల్లల (లేదా పిల్లుల) తల్లి రాజమ్మ రంగం మీదికి వస్తుంది. "ఏదో దాన్నమ్మకందాన్ని. ఇదో శేషమ్మా! ఊర్మిళ లేచినప్పుడు మాత్రం నీ కొడుకును ఎదురుగా రానియ్యకు" అని ఆదేశిస్తుంది. ఆ ఆదేశాన్ని శేషమ్మ పాటించాలని చూస్తుంది. కానీ, సాధ్యంకాదు. రోగోడు, శేషమ్మ ఎక్కడికి నడిస్తే అక్కడికి నడుస్తూ వెంటపడుతుంటాడు. రోగోడు అడుగుతీసి అడుగుపెట్టడానికి అలసి పోతున్నట్టు కనిపిస్తాడు. కానీ, అమ్మ వెంట నడవడానికి మాత్రం 'అలసటయే ఎరుంగని' వాడులా కనిపిస్తాడు. అడుగులో

అడుగువేస్తూ వెళ్ళలేడు కానీ, అడుగుల్లో అడుగులేస్తూ అనుసరించగలడు. ఉదాహరణకు, శేషమ్మ గుంత కుళాయి నుంచీ ఇంట్లోకినీళ్ళు మోస్తూందనుకుందాం. అప్పుడు అమ్మ వెనకాల బయల్దేరిన రోగోడు నెమ్మదిగా వెళ్తుండగానే, ఆమె ఇంట్లో నీళ్ళుపోసేసి తిరిగొస్తుంది. అక్కన్నించే తనూ వెనుతిరుగుతాడు రోగోడు. గమ్యం చేరినా చేరక పోయినా వాడి ప్రయాణం నిరంతరమైనది. రోగోడు ఎప్పుడూ అమ్మ వెనకంబడి ఎందుకుతిరుగుతాడు? "ఏలసలిలంబు పారు? గాడ్పేల విసరు?"

ఒక్కోసారి రోగోడు తనకెదురుపడినప్పుడు, ఖాళీ బిందెతో వాడి నెత్తిన చిన్నగా మొత్తుతుంది శేషమ్మ. అది కానీ రాజమ్మచూసిందంటే "బిందె సొట్టపోతుందే" అని కేకేస్తుంది. "వాని తలకాయకేంకాదు కానీ బిందెసొట్టపోతుందంట" అని తిట్టుకొంటుంది శేషమ్మ. అట్లా తిట్టుకుంటుంది కానీ, రోగోడి తలమీద బిందెతో కొట్టినప్పుడల్లా, ఆమె హెచ్చరిక జ్ఞాపకంరావడం వల్లనే చిన్నగా కొడుతుందేమోననిపిస్తుంది. మొత్తం మీద .............. పిల్లలన్నీఏదో పనిమీద వున్నప్పుడు ఎలక్కిఏదో కొంచెం ఊపిరాడుతుందేమోకానీ, తీరిగ్గావుండి చెలగాటం ఆడాలన్న ఉబలాటంతో వున్నప్పుడు ఎలక్కి మహాప్రాణసంకటంగా వుండక తప్పదు.

"నువ్వు చూస్తే గుమ్మటం మాదిరుండావు, యీ తొండగాడునీకెట్టా పుట్టినాడే!" అని రాజమ్మ చెలగాటం నాటకానికి తెరఎత్తుతుంది. మిగతా పాత్రధారులూ రంగస్థలంలో వుంటారు. శేషమ్మ ఏంమాట్లాడదు. మాట్లాడకపోతేఎట్లా? "ఏమే! మాట్లాడవూ?" అని వొత్తి అడుగుతుంది రాజమ్మ. "ఎట్టపుట్టినాడంటే ఏంజెప్పేది! అందరాల్నే ...." అంటుంది నసుగుతూ శేషమ్మ. విరగబడినవ్వుతుంది రాజమ్మ. ఎవరూ చేయని తప్పుపని తాను చేసినట్టు సిగ్గపడుతుంది శేషమ్మ. రాజమ్మ నవ్వులో అర్థం శేషమ్మకు తెలిసిపోతుంది. "అందరాల్నే పుట్టినాడా రోగోడు? అంటే, నాకు ఊర్మిళ, విజయకుమార్, శైలజ పుట్టినట్టే నీకూ వాడూ పుట్టినాడంటావ్! అయితే, యీ అందరాలా వాడెందుకు లేడు? "రాజమ్మ యీమాటలన్లేదు. ఆమెనవ్వులోనే ఆమాటలున్నాయి. లేకపోతే, శేషమ్మకు అట్లా అనిపిస్తోందా? శేషమ్మకు 'అట్లాఅనిపించడమే' రాజమ్మక్కావలసింది.

రాజమ్మ మాటల్లోనూ, మాటల్లేకుండానూ శేషమ్మతో చెలగాటమాడగలదు. ఇప్పుడు యేమీ మాట్లాడకుండానే వొక్కనవ్వుతోనే చెలగాట మాడిందా, ఒక్కోసారి ఒక్కమాటతో చెలగాటమాడనూగలదు. ఉదాహరణకు, "నువ్వుచూస్తే గుమ్మటం మాదిరుండావు, యీ తొండగాడు నీకెట్టా పుట్టినాడే" అన్నమాటనే తీసుకుందాం. అదేదో సర్వసాధారణమైన ప్రశ్నగానే కనిపిస్తుంది. రాజమ్మ స్వభావం తెలిసిన వాళ్ళక్కానీ ఆమాటలోని విశేషార్థం

తెలీద్దు. నిజానికి శేషమ్మ గుమ్మటం మాదిరుండదు. రోగోడు తనకొడుకు మాదిరి లేకపోతే, తనైనా రోగోడి తల్లి మాదిరివుంటే బావుండేదనుకుంటుంది శేషమ్మ. అట్లా లేకపోయినా, అట్లావున్నాననుకుని వున్నందుకు సిగ్గుపడేటట్లు చేయడంలోనే రాజమ్మకు సంతోషముంది. అందుకు, గుమ్మటంలా లేని శేషమ్మను 'గుమ్మటం మాదిరి వుంది' అని లోకమంతా నిర్ధారించినట్టు చెప్పడంలో రాజమ్మ హింసానైపుణ్యం వుంది.

ఇటువంటి నైపుణ్యంలో ఆపిల్లలూ తీసిపోరు.

"శేషమ్మ గుమ్మటంలా వుంటే సరిపోయిందా? వాడికి పోషకాహారం ఇస్తే కదా!" అంటుంది ఊర్మిళ.

"ఆ ...... శేషమ్మట్టాటోళ్ళందరూ, ఏం పోషకాహారం ఇస్తుంటారు! వాళ్ళందరూ యీడిమాదిరేవుండారా? ఎప్పుడూ ఏదో తింటూనే వుంటాడుగదా......... వాడిబతుకే అంత" అని చప్పరిస్తుంది రాజమ్మ. పోషకాహారప్రాధాన్యతని తక్కువ చెయ్యడమంటే, తన మెడిసిన్ చదువునే తీసేసినట్టు అనిపిస్తుంది ఊర్మిళకు.

"ఏదో గడ్డి ఎప్పుడూ తింటూవుంటే సరిపోయిందా? శేషమ్మా, వాణ్ని మంచి పిల్లల డాక్టర్‌కు చూపించి, బలాన్నిచ్చే తిండి పెట్టు. రోగోడు ఎందుకుబాగుపడ్డో చూస్తాను." అని సవాల్ విసురుతుంది ఊర్మిళ. ఆ సవాల్‌ను స్వీకరించవలసిన ఇద్దరిలో ఒకరైన శేషమ్మ ఏమాత్రం దాన్ని స్వీకరించగల పరిస్థితిలో లేదు. రోగోన్ని పిల్లల డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్ళడం సాధ్యమవుతుందేమో కానీ, రెండోదిసాధ్యం కాదు. బతకనిచ్చే తిండి పెట్టగల్దేమో కానీ, బలాన్నిచ్చే తిండి పెట్టలేదు. ఇకరెండో వారైన రాజమ్మ సంగతి..... 'రోగోడి బతుకే' అంత, అన్నది ఆమె నమ్మకం. వాడికి బలమైన తిండి పెట్టనిచ్చి, వాన్ని బాగుపడనిచ్చి, తన ఇష్టమైన నమ్మకాన్ని కోల్పోవడం ఇష్టంలేదు. అంచేత, ఆమె కూడా ఆ సవాల్‌ను స్వీకరించదు. చిన్న పిల్ల, తల్లిపైనే పరోక్షంగా సవాల్ విసరడాన్ని పెద్దరికం అంగీకరించదు.

"డాక్టరంటే జ్ఞాపకమొచ్చింది. నిన్న ఆయనిచ్చినమందు మీ నాన్న చేత తాగించావా? రోగోన్ని నువేం బాగుచేస్తావు కానీ ఆ సంగతిచూడు" అని ఆదేశించి, తన గౌరవాన్ని నిలుపుకుంటుంది. "ఓ ........ నాన్న సంగతి మర్చి పోయాను" అని, మెట్ల మీదుగా ఎగురుతా, మేడమీదికి వెళ్తుంది ఊర్మిళ.

★ ★ ★

వెంటస్వామి వెంకటన్నగా వున్నప్పుడు, పొలాల్లో కూలిపని చేశాడు. శరీరాన్ని పిండి చెమట కార్చాడు. బీట్లోనూ, పైర్లలోనూ గొంతుకూర్చొని, ఎడమ అరచేతిలో గుండ్రాయిలాంటి సంగటి ముద్ద పెట్టుకుని కుదురుచేసి, దాంట్లో పప్పో పచ్చడో వేసుకుని అపురూపంగా తిన్నాడు. అట్లాంటి వెంకటన్నకు రంగయ్యా శెట్టిదగ్గర నౌకరీ దొరకింది. ఆ వూళ్ళో వున్న రంగయ్యా శెట్టి అంగడికి, పట్నం వెళ్ళి సరుకులు తీసుకురావడానికి వెంకటన్నకుదిరాడు. ఒక్క అంగడే కాదు, రంగయ్యా రకరకాల వ్యాపారాలు నడిపేవాడు.

రైతులు వేరుసెనగవేసిన పొలాల్లో పైరు వొడుపుకుని, రాలిన కాయలూ, భూమిలో మిగిలిన కాయలూ సేద్యం చేసి సాధ్యమైనంతవరకూ ఏరుకుంటారు. ఇంకా భూమిలో మిగిలిపోయిన వాటిని బీదా బిక్కీ ఏరుకుని, వాటినమ్ముకుని ఉప్పో, మిరపకాయో కొంటారు. పిల్లలైతే ఏ చిరుతిండ్లో కొంటారు. జేబులో కొంత డబ్బువేసుకుని, వెంకటన్న నెత్తికి గోనెసంచులెత్తి, పొలాల్లోకి పోయి ఏ చెట్టు నీడనో కొలువుతీరతాడు రంగయ్యా. రోజంతా పొలంలో గోకి గోకి, వేళ్ళు చితగ్గొట్టుకుని, ఆకలికీ దప్పికీ అల్లాడి ఏరుకున్న వేరుసెనక్కాయల్ని రంగయ్యా కమ్ముతారు. వాటి ధరతెలీదు వాళ్ళకు. తెలిసినా, ఏమీ చెయ్యలేని అవసరం. తూకం లో మోసాలు తెలీవు. అతనెంతిస్తే అంత తీసుకుంటారు. ఆ డబ్బు తీసుకుని ఊళ్ళో అంగడి కొస్తే, అక్కడ సరుకులిచ్చేది రంగయ్యా భార్య. అంటే, ఇక్కడ డబ్బు, అక్కడి లాభమూ అందేది రంగయ్యాకే. ఒక్కొక్కరూ అమ్మేది కొద్ది కాయలే అయినా, చీకటి పడే వేళకు వెంకటన్న నెత్తిమీది బరువుతో చెమటలు కారుస్తుండగా, వెనకాల వచ్చే రంగయ్యా ఇల్లు చేరుకుంటాడు. ఇట్లా కొన్న వేరుసెనక్కాయల్ని బస్తాలుగా బండిమీదేసుకుని, పట్నం వెళ్ళి అమ్మితే ...... పెట్టుబడికి పదిరెట్ల లాభం చేరుతుంది. పత్తి పొలాలు ఉడిగేటప్పుడు కూడా ఇదే వ్యాపారం.

రంగయ్యా శెట్టి, పొలంలో తేలు కుట్టి చనిపోయాక వెంకటన్న యీ రెండు వ్యాపారాలూ కొనసాగించాడు. నాలుగైదేళ్ళలోనే వెంకటన్న వెంకయ్యాగా మారి, పల్లెలో పట్టనంతగా తీరి, పట్నం చేరి వెంకటస్వామిగా కుదిరాడు. ఒక గోడౌన్ అద్దెకు తీసుకుని, దగ్గరే ఆఫీసు కంటూ ఒకగది తీసుకుని, అందులో ఫోన్ పెట్టుకుని, గది నిండా పరుపులు పరచి కూర్చున్నాడు. రైతులు వేరు సెనక్కాయలు బండ్ల మీద వెంకటస్వామి గోడౌన్ కి తోల్తారు. ఆసరుకును ఆయన అక్కణ్ణే కూర్చొని, వక్కపొడి నముల్తూ, సిగరెట్ పీలుస్తూ, పక్కవాళ్ళతో రాజకీయాలగురించో, సినిమాలగురించో మాట్లాడ్తూ నవ్వుకుంటూ, ఫోన్ ద్వారా మార్కెట్ రేటుకు విక్రయిస్తాడు. ఆడబ్బు తనకందేదాకా, రైతును "రేపురా, మర్నాడురా" అని తిప్పుకుంటాడు. గోడౌన్ అద్దె, తూకాలకు, సంచులకు, తన మెయింటెనెన్స్ ఖర్చులకూ,

ఇట్లాంటివన్నీ రైతుల నెత్తిన్నేపడతాయి. ఇంకా కొంత మంది రైతులకు విత్తనాలకో, ఎరువులకో అప్పులిచ్చి, వేరుసెనక్కాయ తనగోడౌన్‌కే తోలే వప్పందం చేసుకుంటాడు. చూస్తూ చూస్తూ వుండగానే, తను కూలికి వెళ్ళిన రైతులతోనే 'ఎంకటస్వామిగారూ' అని పిలిపించుకున్నాడు. లక్షల కట్నాలిచ్చీ, తెచ్చుకునీ కూతుళ్ళకూ, కొడుకులకూ పెళ్ళిళ్ళు చేశాడు.

ప్రస్తుతం వెంకటస్వామి వ్యాపారాల్ని కొడుకులూ, అల్లుళ్ళూ చూసుకుంటుండగా, పెళ్ళికాని పిల్లలు చదువుకుంటుండగా, వెంకటస్వామి శరీరం విశ్రాంతి తీసుకుంటోంది. రోజూ ఉదయం పూట కొంచెం దూరం నడిస్తే మంచిదని డాక్టర్ సలహాఇచ్చినా, వెంకటస్వామి శరీరం అందుకు వొప్పుకోడం లేదు. బయటికి వెళ్తే కారులో వెళ్ళి రావడం కొన్నేళ్ళుగా అలవాటయింది దానికి. ఊరిదగ్గర ఎండకూ, గాలికీ పొలాల్లో తిరిగిన సంగతి అది పూర్తి గామరచిపోయినట్టుంది. వెంకటస్వామి శరీరం మరచిపోయిన విషయాన్ని, వెంకటస్వామి మనస్సు మరచిపోలేకపోతోంది. వెంకటస్వామి 'మనస్సు'కైనా, ఆపల్లెటూరిని ఇంకా జ్ఞాపకముంచుకోవలసిన అవసరమేదీలేదు. వెంకటస్వామి శరీరమే మనస్సుకు ఆ అవసరం కలిగించినట్టుంది. "ఆ శరీరం యీ శరీరంగా ఎట్లా మారిందా ? ఆ ఆకలి యీ అజీర్ణంగా ఎట్లా అయిందా ?" అన్నదే వెంకటస్వామి ఆలోచన.

పొలంలో కూలోళ్లు వరుసగా కూర్చున్నారు. ఒకామె గంపతో సంగటి వడ్డిస్తోంది. సంగటి ముద్ద తమచేతిలోకి వచ్చేదాకా కూడా ఓపిక పట్టలేనట్టు, మొత్తంగా సంగటి గంపనే నంచుకుని తినాలనివున్నట్టు ....... వాళ్ళ కళ్ళల్లో ఆకలి. ఆ సంగటి రూపం, దానివాసన అంతా అపురూపం! ఆసంగటికీ వాళ్ళ ఆకల్ని తీర్చడంలో సంతోషం వున్నట్టు సార్థకత వున్నట్టు........ అది అన్నానికీ వాళ్ళకూ వున్న సజీవసంబంధం! ఆ కూలోళ్ళల్లో ఒకడుగా తనువుండినాడు. ఆ ఆకలిని తను రుచిచూసినాడు! ఇప్పుడెంత మంచి ఆహారం తీసుకుంటున్నా ఆ రుచివుండటం లేదు. తన ఇంట్లో మనుషులంతా కూడా ప్రతి రోజూ ఉదయం ఫలహారంతో సహా రెండు పూటలా భోజనాలు చేస్తూనేవున్నారు. అయితే, ఎన్నడూ అటువంటి ఆకలేసి మాత్రం కాదు. "అబ్బ! ఆకలి, ఆకలి" అంటూ అప్పుడప్పుడూ కేకలు వేసినా, అది అలవాటైన ఆకలే తప్ప అసలైన ఆకలికాదు. అలవాటైన ఆకలికి తినేవాళ్ళకు 'ఆకలి' అంటే ఎట్లా వుంటుందో తెలీదు. ఓ పూటపస్తువుంటే, మరోపూట నీరసం కారణంగా తినవలసిందే కానీ, అప్పుడైనా అటువంటి ఆకలివల్ల కాదు. తాను ఒకప్పుడు అర్థుడైన ఆకలికి ఇప్పుడు అర్థుడుకాడు. అయితే, అటువంటి ఆకలిని కళ్ళతోనైనా చూడగలిగితే! అన్నసంతర్పణల్లో కనిపించేది కక్కుర్తే తప్ప ఆకలికాదు. అది అసహ్యంగా

వుంటుందే తప్ప అద్భుతంగా వుండదు. "అన్నం పరబ్రహ్మస్వరూపం" అనేవాడు తన అబ్బ. అన్నం పరబ్రహ్మస్వరూపంగా కనిపించే అటువంటి దృశ్యాన్ని మళ్ళా చూడాలి.

★ ★ ★

వెంకటస్వామి మేడమీద నుంచీ పెరట్లోవున్న ఊర్మిళకేసీ, రోగోడికేసీ చూస్తున్నాడు. తండ్రి తనను గమనిస్తున్నట్టు కనిపెట్టగానే ఊర్మిళ మరింత హుషారుగా ఆట మొదలుపెట్టింది. అది అక్కడున్న ప్రేక్షకుల్లో ఆసక్తి కలిగించింది. ఊర్మిళ చేతిలో వున్న ఉప్మా ప్లేటు కేసి, రోగోడు కుక్కలా చూస్తోన్నాడు. ఊర్మిళ చేయి ముందుకు చాస్తే, వాడూపుల్లలా వున్న తనచేయిని ముందుకు చాపాడు. ఊర్మిళ చటుక్కున వెనక్కి తీసుకుంది. వాడి చెయ్యి అక్కడేవాలిపోయింది. ఊర్మిళ మళ్ళీ ప్లేటుముందుకు చాపింది. వాడు చెయ్యిచాపకుండా వుండలేనట్టూ .......... మళ్ళీ వెనక్కి తీసుకుంటుందేమో నన్న భయంతో వున్నట్టూ........... చాపినాడు. ఇట్లా రెండు మూడుసార్లు ఊర్మిళ వినోదించి, వినోదం పంచాక ప్లేటు ఇచ్చేసింది. రోగోడు ఉప్మాతినడంలో మునిగి పోయాడు. గోడకానుకుని, కళ్ళు మూసుకుని తింటున్న వాడి కేసి చూస్తూ వుండిపోయినాడు వెంకటస్వామి. తను చూడాలనుకుంటున్న దృశ్యం ఇదికాదు. రోగోడికి మహాఆకలి అనీ, ఎప్పుడూ ఏదోఒకటి తింటూనే వుండాలనీ తన పిల్లలు అంటూ వుండటం చాలా సార్లు విన్నాడు. 'దరిద్రునికి ఆకలి ఎక్కువ' అని, శేషమ్మ కూడా వాడిది ఆకలికిందనే నిర్ధారించింది. కానీ, రోగోడిది ఆకలిలా కనిపించడం లేదు వెంకటస్వామికి. ఆకలి ఇచ్చే అనుభవం వాడిలో ఎక్కడాకనిపించడమే లేదు. తిండిని వాడేదో కసితో తింటున్నట్టుగా వుందే తప్ప, ఆకలిరుచితో తింటున్నట్టులేదు. వాడికి తిండి మీద 'కసి' ఎందుకేర్పడినట్టు? బహుశా తిండి లేకపోవడం వల్లనే కావచ్చు.

'అన్నం పరబ్రహ్మస్వరూపం' అయితే, అది రోగోడి లాంటివాడికీ కాదు, తన లాంటివాడికీ కాదు, అలవాటైన ఆకలికి తినేవాళ్ళకూ కాదు............ నిట్టూర్చాడు ఒకప్పుడు వెంకటన్నగా జీవించిన వెంకటస్వామి.

*(ప్రచురణకాలం బహుశా 75,76 కావచ్చు. 'యువ' దీపావళి ప్రత్యేక సంచికలో వచ్చింది.)*

# -- కథ గురించి. . .

పొలాల్లో శ్రమించిన కూలీలు అన్నం తినే దృశ్యాన్ని, ఈకథరాసిన ఇరవైఏళ్ళ తర్వాత 'పెన్నేటికతలు'లో మళ్ళీ చూపించాను. ఈ కథను ఇప్పుడు చూసేంత వరకూ, పెన్నేటికతలకు ముందే వీళ్ళను చూపించినట్టు నాకు జ్ఞాపకం లేదు. ఈ కథలో ఓ పాత్ర జ్ఞాపకాలలో ఓక్షణం కనిపించిన వాళ్ళు, పెన్నేటికతల్లో, 'తూర్పునాటికూలీలు' గా వాళ్ళు వాళ్ళ వాస్తవ జీవితాలతో మరింత సమగ్రంగా కనిపించారు.

చెప్పినట్టు జ్ఞాపకం లేకపోయినా, రెండు దశాబ్దాల తర్వాత మళ్ళీ అదే సందర్భాన్ని జ్ఞాపకం చేసుకోవడం అంటే, అది హృదయ విదారక జ్ఞాపకంగా వుండి పోయిందనే అర్థం. శ్రమ విలువను తెలియజెప్పడమనే మామూలు ఉద్దేశంతో పాటు, అరుదైన మానవీయ అనుభవాన్ని అంతర్లీనంగా చెప్పాలన్నది ఆలోచన./ సుప్రసిద్ధహాస్యనటుడు రేలంగి వెంకట్రామయ్యగారు ఒక ఇంటర్వ్యూలో/ 'ఆకలివున్నప్పుడు తిండి లేదు, తిండివున్నప్పుడు ఆకలిలేదు' అని నిర్వేదంతో చెప్పిన సంగతి కూడా కొంత ప్రేరణ ఇచ్చింది.